# ఇల్లు కట్టిచూడు



ప్రపంచ తెలుగు మహాసభలకు ఎలాగయినా వెళ్ళాలని అందరం దానితాలూకూ సీక్రెట్ ఇన్‌ఫర్మేషన్ లాగే ప్రయత్నంలో ఉన్నాం.

"కాంగ్రెస్ వాళ్ళను పట్టుకుంటే చాలా తేలిగ్గా వెళ్ళిపోవచ్చు" అన్నాడు జనార్ధన్

"కానీ వాళ్ళను ఎలాపట్టుకోవటం?" అడిగాను నేను.

ఆ ప్రశ్నకు అందరూగొల్లుననవ్వారు. నన్నో వెర్రివెంగళాయిని చూసినట్టు కూడా చూశారు.

"రాజకీయ నాయకుల్ని ఎలా పట్టుకోవాలో తెలీదా!భలేవాడివయ్యా నువ్వు! ప్రపంచంలో అతితేలకయిన విషయం అదే"

ఆవిషయంగురించి డిస్కషన్ పూర్తయిపోయాక రంగారెడ్డి అసలు విషయం ప్రస్తావించాడు.

"ఆమధ్య మా అమ్మమ్మ చనిపోయిన విషయం మీకందరికీ తెలుసుకదా! ఇప్పుడు ఆమెతాలుకూ ఇంటిస్థలం ఒకటి నాకు సంక్రమించింది. అదెక్కడుందో, ఏమిటో ఇంకా వివరాలు తెలీవు. సరే–హైద్రాబాద్‌లో స్థలం దొరకటమే మనలాంటి వాళ్ళకు అపురూపమయిన విషయం గుక అక్కడ ఇల్లు కడదామని మా ఆవిడగొడవచేస్తోంది."

మాకందరికీ హఠాత్తుగా రంగారెడ్డి మీద ఈర్ష్యా కలిగింది.

రాజధానిలో స్థలం దొరకటం, ఇల్లుకట్టడం ఒక్క చీఫ్ మినిష్టర్‌కీ మిగతా మంత్రులకీ తప్ప మరెవరికీ సాధ్యంకాదని మాఅనుమానం.

ఎందుకంటే వాళ్ళకు ప్రభుత్వ రూల్సేమీ వర్తించవు గనుక.

ఏదేమయినా మా అందరికీ సొంత ఇల్లు లేకుండా వుండటం కంటే మాలో ఒక్కడికయినా ఇల్లు వుండటం మంచిదే అనిపించింది కాసేపయ్యాక.

"ఇంక ఆలోచనెందుకు కట్టిపారెయ్" అన్నాడు శాయిరామ్.

"కానీ అది అంతతేలిక్కాదని విన్నాను. మన ఫ్రెండ్స్ సర్కిల్లో ఇల్లు కట్టిన వాడెవడయినా వుంటే వాడిసలహా అడుగుదాం" అన్నాడు గోపాల్రావ్.

"దాన్దేముందీ? బాబు వున్నాడుకదా! రీసెంట్‌గానే ఇల్లు కట్టాడు. పదండి! అతని దగ్గరకెళదాం" అన్నాడు జనార్ధన్.

అందరం బాబు ఇల్లు వెతుకుతూ బయలుదేరాం. అరగంట సేపట్లో మాస్కూటర్లు నగరం బయట కొచ్చేసినాయి. వనస్థలిపురం కూడా దాటిపోయేసరికి మాకు ఓపికపోయింది.

"ఇంకెంత దూరం వెళ్ళాలి?" అడిగాడు గోపాల్రావ్.

"ఆ!– ఎంత? ఇంకో నాలుగు కిలోమీటర్లు! చాలా దగ్గర"

మరోరెండు కిలోమీటర్ల దూరంవెళ్ళాక మెయిన్‌రోడ్‌నుంచి పక్కకు తిరిగాం. అదో మట్టిరోడ్డు.! అంతాగుట్టలూ, రాళ్ళూ, చెట్లూ తప్పితే ఇంకేమి కనిపించటం లేదక్కడ.

మరో కిలోమీటర్ దూరం తర్వాత మట్టిరోడ్డు కూడా ఆగిపోయింది. ఓసన్నని కాలి త్రోవ మాత్రం కనబడుతోంది.

"ఇంకెక్కడ?" అడిగాడు యాదగిరి అగిపోయి.

"అదిగో! ఆ చెట్టుచాటున సగం కట్టినిల్లు కనిపించటంలేదూ? అదే మనోడిల్లు"

అందరం అదిరిపడ్డాం.

"ఏమిటి. ఇంత మారుమూల ఇరుగుపొరుగూ లేకుండా ఒక్కడే కాపురముం టున్నాడా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇది మారుమూలేమిటి? బాగా డిమాండ్ వున్న ప్లేస్. అయినా మనాడింటికి కిలోమీటర్ దూరంలో ఇంకొకతనుకూడా ఇల్లు మొదలుపెట్టాడట! ఇంక సందడికేం తక్కువని!"

అందరం బాబు ఇంటికి చేరుకున్నాం.

కాంక్రీట్ పిల్లర్స్‌తో కట్టాడది. ఉట్టి స్తంభాలూ, పైన కాంక్రీట్ శ్లాబ్‌మాత్రం లేసివుంది. రెండుగదులకు మాత్రం వున్నాయ్. మిగతాగదులన్నీ ఓపెన్‌గానే వున్నాయ్. దగ్గరకు వేసివున్న గది తలుపు తట్టాడు జనార్ధన్.

లోపల దభేల్‌మన్న చప్పుడూ దానివెనుకే పరిగెడుతున్న అడుగుల చప్పుడూ వినిపించింది. మాకు ఏమీ అర్ధంకాలేదు.

"బాబూ!" మళ్ళీ తలుపు తట్టాడు జనార్ధన్.

ఈసారి మళ్ళీ పరుగుచప్పుడు వినిపించింది. ఆతరువాత రెండునిముషాలకు వాళ్ళావిడ తలుపు కొంచెంగా తీసి అడ్డం నిలబడింది.

"ఆయన ఊళ్ళోలేరండీ. విశాఖపట్నం వెళ్ళారు ఆఫీస్ పనిమీద. ఇంకో వారం రోజులవుతుంది తిరిగిరావటానికి–" అంటూ జనార్ధన్‌నీ, మమ్మల్ని చూసి చిరునవ్వుతో తలుపు తెరిచింది.

''మీరా అన్నయ్యా! రండి! ఇంకెవరో అనుకున్నాను'' అంది. అందరం బిలబిలమంటూ లోపలకునడిచాం.

ఆ గదిలో కుర్చీలు, టీపాయ్, టీ.వీ, ఫ్లవర్‌వాజ్ అంతా బాగానే వుంది. కాకపోతే గోడలకింకా రంగువేయలేదు.

"వైజాగ్ ఎప్పుడు వెళ్ళాడు? నిన్న సాయంత్రం కూడా కనిపించాడు గానీ నాతో ఏమీ చెప్పలేదే" అన్నాడు జనర్ధన్.

ఆమె జవాబు చెప్పటానికి సిగ్గుపడింది.

"నిజానికి ఆయన వైజాగ్ వెళ్ళలేదన్నయ్యా! ఇంట్లోనే ఉన్నారు కానీ– అంటూ లోపలి గది అటకవేపు చూస్తూ" ఏవండీ! దిగండి! మనకాలనీవాళ్ళే వచ్చారు" అంది.

డబ్బాలూ, అట్టపెట్టెలూ అన్నీ పక్కకుతోసుకుంటూ అటకమీదనుంచి కిందకు దిగాడు బాబు. మొఖం, బట్టలూ అంతాదుమ్ముఅంటుకుపోయి భయంకరంగా కనపించసాగాడు.

మాకు కొద్దిక్షణాలవరకూ నోటమాటరాలేదు.

టవల్‌తో మొఖం తుడుచుకుంటూవచ్చి కుర్చీలో కూర్చున్నాడు బాబు.

''మరేం లేదు. అప్పులాళ్ళేమో అనుకుని అటక మీదెక్కాను'' చిరునవ్వుతో చెప్పాడతను.

"అప్పులాళ్ళేమిటి?" ఆత్రుతగా అడిగాడు రంగారెడ్డి.

"అదే! ఇల్లుకట్టాను కదా! అంచేత కొద్దిరోజులు కొంచెంయిలా అప్పులవాళ్ళనుంచి తప్పించుకోక తప్పదులే!"

"కొద్దిరోజులంటే ఎన్నాళ్ళు?"

"ఆ! మహా అయితే అయిదారేళ్ళు. అప్పులిచ్చేవాళ్ళు మొదటి అయిదారు సంవత్సరాలే మహాదూకుడుగా వుంటారు. తర్వాత వాళ్ళ పవర్ కొంచెం తగ్గిపోతుంది. అప్పుడు ఎదుటపడినా ఏం ఫర్లేదు. కాసేపుగొణిగిపోతారు. అదే మరోఅయిదేళ్ళు బాకీ తీర్చలేదనుకోండి. అప్పుడు ఆ గొణగడం కూడా వుండదట. మనం కనబడితేచాలు భోరునేడుస్తూ కాసేపు మనవెంటపడతారట. మనం అదేం చూడనట్లు, వాడి ఏడుపుతో మనకేమీ సంబంధంలేనట్లూ వెళ్ళిపోవాలట. మనకాలనీలో ఉండే బోస్ చెప్పాడివన్నీ. వాడు ఇల్లుకట్టి చాలాకాలం అయిపోయింది కదా?" రంగారెడ్డి కొంచెం నిరుత్సాహపడినట్లు

మాకనిపించింది.

"ఇంతకూ ఏమిటిలా హఠాత్తుగా వచ్చేశారు? కొంచెం ముందే చెప్పివస్తూండండి! సాధారణంగా బయట తలుపు చప్పుడవగానే నేను వెనుక తలుపు తీసుకుని అయిదారు కిలోమీటర్లు పరుగెత్తు కెళ్ళిపోతాను. మళ్ళా అయిదారు గంటల తర్వాతగాని ఇల్లు చేరుకోను!"

"మరిమేము ఇందాక తులుపుకొట్టినప్పుడు వెళ్ళలేదేం?"

"ఇంతకుముందే రెండుసార్లు వెళ్ళిఇప్పుడే ఇంటికి చేరుకున్నాను. ఇప్పుడు మళ్ళీ పరుగెత్తాలంటే కొంచెం బద్ధకంవేసింది. అందుకని రిస్క్‌తీసుకుని అటక ఎక్కేశాను. నిజంచెప్తున్నాను. అటక చాలా రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. కొంతమంది అప్పు లాళ్ళు ఎంత తెలివిమీరి పోయారంటే సరాసరి ఇంట్లో కొచ్చేసి అటక మీదెక్కి వెతుకు తున్నారు. రెండుసార్లు దొరికిపోయానలా! అలా దొరికిపోయినప్పుడు పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుందిలే!"

"సంగతేమిటంటే మన రంగారెడ్డి ఇల్లుకటాలని అనుకుంటున్నాడు! నీ అనుభవా లేమిటో చెపితే– దానిని బట్టి–" చెప్పాడు జనార్ధన్.

బాబు రంగారెడ్డి వేపు చూశాడు జాలిగా.

"ఏం గురూజీ! మీరు ఇల్లు కట్టాలనుకుంటున్నారా?" అశ్చర్యంగా అడిగాడు.

"అవును! ఏం"

"అహహ– ఏం లేదు! పీస్‌ఫుల్‌గా ఉండే మీ జీవితం కాస్తా ఊపిరి తిరగనంత పనితో నిండిపోతుంది ఇల్లుకట్టడం మొదలయిందంటే ఇప్పుడున్న సంతోషం ఉండదు. ఆకలి వేయదు. నిద్రరాదు! నేను కంటినిండా నిద్రపోయి పదిహేను రోజులు అయింది."

రంగారెడ్డి మరింత నిరుత్సాహపడిపోయాడు.

"అయినా గానీ మనం బయపడకూడదు. ఎందుకో తెలుసా?.

అందరం ఆత్రంగా అతనివేపు చూశాం.

"ఎందుకంటే– మనసులో ఎంతో సెక్యూరిటి ఫీలవుతాం! మనదేశంలాంటి దిక్కుమాలిన దేశంలో గవర్నమెంట్ సర్వెంట్స్‌కి ఆఫీలింగ్ చాలాఅవసరం. మీకు తెలీదేమో! మా ఆఫీస్‌లో సీనియర్ క్లర్క్‌గా పనిచేసిన మూర్తి గారి గతేమయింది? రిటైరవగానే గవర్నమెంట్ క్వార్టర్స్ ఖాళీ చేయించేశారు. దాంతో తక్కువ అద్దెవున్న ఇంటికోసం తిరిగి తిరిగి చివరకు ఆ ఎండకు వడకొట్టి చచ్చిపోయాడు. అదీగాక ఇంకో ముఖ్యమయిన విషయం ఒకటుంది. అదేమిటంటే మనం మన సొంతింట్లో ఉంటున్నాం అనే ఫీలింగ్! ఆహా! ఎన్ని బాధలయినా పడనీ! నాకెంత ఆనందంగా ఉంటుందో తెలుసా? ఈ ఇల్లసలు పూర్తవనీ, అవకపోనీ– నేను అటకమీదేకాపురం ఉండనీ! అయినా పర్లేదు! నా

ఇల్లు ఆహా! ఎంత అద్భుతమయిన ఫీలింగో మీకు తెలీదు మీరు గవర్నమెంట్ కాలనీలో ఉన్నారు గనుక మీకా ఫీలింగు తెలీదు కానీ నాలాగా అద్దె ఇళ్ళల్లో కొంతకాలం గడిపిననోడికి తెలుస్తుంది."

వాళ్ళవిడ అందరికీ మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

"సారీ అన్నయ్యగారూ! మేము కాఫీ, టీ తాగటం మానేశాం– ఇల్లు కట్టిన దగ్గర్నుంచీ! ఏదో మనకు వీలయినంత పొదుపు మనం చేయాలి కదా!" అందామె దిగులుగా.

"అవునవును! తప్పదు మరి!" అన్నాడు శాయీరామ్ భయంగా.

మేమందరం లేచి బయటకు నడవబోతుండగా ఓవ్యక్తి స్కూటర్ మీద వచ్చి ఇంటి ముందు ఆగాడు. మాతోబాటు బయటకు రాబోతున్న బాబు అతనిని చూడగానే చెంగునవెనకకు గెంతి పెరటి తలుపు తీసుకొని మెరుపులా పారిపోయాడు.

"ఉన్నాడా?" ఆ వ్యక్తి మమ్మల్ని అడిగాడు.

"లేడు! అందుకే మేము వెళ్ళిపోతున్నాం" అన్నాడు శాయీరామ్ చప్పున.

"నీ యవ్వ. నాబాకీ సంగతేమోగానీ వసూల్జేయటానికి పెట్రోలుకీ దానికీ డబుల్ అయేట్లుంది థూ" అనుకుంటూ వెళ్ళిపోయాడతను.

మేము రింగ్‌రోడ్ దగ్గరకొచ్చేసరికి కనకయ్య పాన్ డబ్బా దగ్గర నిలబడి "నమస్తే సార్" అంటూ గట్టిగా అరిచాడు.

దాంతో స్కూటర్లు ఆపక తప్పలేదు.

ఎందుకంటే కనకయ్య అందరికీ బాగా తెలుసు. అతను రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ప్యూన్. మా కాలనీలో కొంతకాలం ఉన్న తర్వాత బంజారాహిల్స్‌లో ఓ అందమయిన మేడ కట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఏమిటి కనకయ్యా! ఇటుపక్క వచ్చావేమిటి?" అడిగాడు రంగారెడ్డి.

ఈ ఏరియాలో ఎనిమిది పోర్షన్‌లతో ఇల్లుకట్టా నీమధ్యే! అద్దె వసూలు చేసుకోటానికి వచ్చాను– అన్నాడు బెన్సన్ అండ్ హెడ్జస్ సిగరెట్ పాకెట్ తీసి ఓ సిగరెట్ విలిగించుకుని మాకూ ఒకటి ఆఫర్ చేస్తూ. మా కాలనీ వాళ్ళందరం విల్స్ సిగరెట్ తాగటమే ఓ లగ్జరీగా భావిస్తుంటాం! అలాంటిది అతను ఆ ఫారిన్ సిగరెట్స్ ఆఫర్ చేసేసరికి ఆశగా, హాపీగా తలోసిగరెట్ తీసుకుని కాల్చసాగాం.

"అద్దెఎంత వస్తుంది– ఎనిమిదిపోర్షన్లకూ?" అడిగాడు శాయీరామ్ కుతూహలంగా.

"ఎంత సార్? చాలా తక్కువ! మొత్తం ఎనిమిదివేలారొందలకంటే ఒక్కపైసా కూడా ఎక్కువ రాదు"

మాగుండెల విశిపోయాయ్. నెలకు ఎనిమిదివేలారొందలు ఇంటి అద్దె కింద వస్తుందా? మేము రిటైరయేప్పుడు కూడా మాకంత జీతం రాదు. మా అందరికీ

పాన్‌డబ్బాలో నుంచే కూల్‌డ్రింక్స్ ఇప్పించాడతను. ఇంత డబ్బు తగలేసి మా అందరికీ కూల్‌డ్రింక్స్ తాగించాలని ఎక్కడుంది? కేవలం మా మీద అభిమానంతోనే కదా!

"పాపం మనాడికి లిఫ్ట్ ఇద్దాం– మన స్కూటర్ మీద" అన్నాడు గోపాల్రావ్ జాలిగా.

"అవునవును– పాపం! అంత ఖర్చుపెట్టి కూల్‌డ్రింక్స్ కూడా తాగించాడు. ఆ డబ్బుపెడితే బస్‌లోనయినా వెళ్లిపోయేవాడు" అన్నాడు జనార్ధన్.

"అవ్ కనకయ్యా! నాస్కూటర్ వెనుక కూర్చో! లిఫ్ట్ ఇస్తాను" అన్నాడు యాదగిరి.

కనకయ్య చిరునవ్వు నవ్వాడు.

"వద్దు సార్! మీ దయవల్ల మొన్నే కారు కొన్నాను– వస్తాన్సార్! మళ్ళీ కలుస్తా" అంటూ పక్కనే పార్క్‌చేసి ఉన్న మారుతీ కార్లో కూర్చుని డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి పోయాడు.

కొద్ది క్షణాలవరకూ మా కెవరికీ మాట రాలేదు. నిశ్శబ్దంగా స్కూటర్స్ స్టార్ట్ చేసుకుని కాలనీ చేరుకున్నాం.

"హు! ఆఫ్టరాల్ రిజిస్ట్రారాఫీస్‌లో ప్యూన్, ఎనిమిదిపోర్షన్లున్న ఇల్లుకట్టగా లేంది నేనెందుకు కట్టలేను? కట్టేస్తా" అన్నాడు రంగారెడ్డి ఆవేశంగా.

"అవును! కట్టగలవ్" అన్నాడు శాయిరామ్.

"కాకపోతే ఇల్లుకట్టడానికి ఎక్కడయినా లోన్ సంపాదించాలి. హౌసింగ్ లోన్ ఎక్కడ దొరుకుతుంది?"

"స్టేట్ గవర్నమెంట్స్ వాళ్ళు లోన్స్ అనేవి ఇవ్వటం మానేశారట" చెప్పాడు గోపాల్రావ్.

అలాంటి మాట చెప్పినందుకు మాకతనిమీద వళ్ళు మండిపోయింది.

"ఎందుకు ఇవ్వటం లేదు?" ఉక్రోషంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎన్.టి.ఆర్. ప్రభుత్వమయ్యా! ఈ ప్రభుత్వంలో ఏ డిపార్ట్‌మెంట్‌కీ, ఫండ్స్ ఉండవ్!" వెటకారంగా అన్నాడు శాయిరామ్.

"అవ్! నేను గవర్నమెంట్ లైబ్రరీ మెంబర్ గదా! మొన్న యండమూరి లేటెస్ట్ నవల రక్తాభిషేకం గురించి లైబ్రరీ ఓళ్ళ నడిగా! అందరూ నన్నో పాగల్‌గాన్ని చూసినట్లు చూసి నగిన్రు! సంగతేమంటే ఎన్.టి.ఆర్. కొలువులోకెక్కుతూనే తెలుగోండ్లకు పుస్తకాలు కొనేది బంద్ చేసిండంట! దీని దిక్కుకెళ్ళి అయిదేండ్ల నుంచి లైబ్రరీల్ల ఎక్క పుస్తకం లేదు–" మండిపడుతూ అన్నాడు యాదగిరి.

"నాకూ అదే అర్థంకావటం లేదు. లైబ్రరీల కోసం మనం మున్సిపాలిటీలకు పన్ను కడుతున్నాం! అది ఆపటానికి ఎన్.టి.ఆర్. ఎవరు?" తనూ తిరగబడ్డాడు జనార్ధన్

"పుస్తకాల్సంగతి అట్లా ఉండనీండి. రిక్రూట్‌మెంట్ బాన్ అంట! మా అన్నయ్య కొడుక్కి ఎన్టీఆర్ వచ్చిన దగ్గర్నుంచి ఇంటర్వ్యూలు కూడా లేవు. కాంగ్రెసోళ్ళ పరిపాలనలో

కనీసం ఎగ్జామినేషన్స్, ఇంటర్వ్యూలయినా వస్తూందేవి!" గోపాల్రావ్ అన్నాడు.

అయినా ఈ గవర్నమెంట్ లోన్ ఎందుగ్గానీ– హెచ్.డి.ఎఫ్.సి.వాళ్ళు లోన్స్ ఇస్తున్నారు గదా! అక్కడి కెళ్తే సరి!" సలహా ఇచ్చాడు చంద్రకాంత్.

రంగారెడ్డి మొఖంలో కల వచ్చేసింది.

"ఆ! ఇస్తారా? ఎక్కడ ఆ ఆఫీసు?"

"బషీర్బాగ్లో ఉంది! రేపు వెళ్దాం"

ఆ రాత్రే రెండింటికి రంగారెడ్డి ఇంట్లో నుంచి కేకలు వినబడితే పరుగుతో వెళ్ళాను. వాళ్ళావిడ అప్పటికే నిద్రకళ్ళతో అక్కడ మూగిన కాలనీవాళ్ళకు సంగతి వివరిస్తోంది.

"మరేం లేదు, ఆయనకు కలొచ్చింది! ఇల్లంతా కట్టాక ఎన్టీఆర్ వచ్చి పడగొడు తున్నాట్ట!"

రంగారెడ్డి ఇల్లు కట్టనీ కట్టకపోనీ గానీ– అతను ముందు ఓ ఇంటిస్థలానికి ఓనరయాడంటే నిజంగా ఓ చిన్నసైజు నవాబు అయినట్లు మా కనిపించసాగింది.

ఆ తరువాత మా అందరికీ నిద్రపట్టడం మానేసింది.

అంటే అది జెలసీ వల్ల కాదు. కాలనీలోని భార్యామణులందరూ మగాళ్ళను నిద్రపోనీయకుండా సాధింపు మొదలు పెట్టారన్నమాట.

"నిద్రకేం లోటు లేదు కదా! మీరేమో రోజూ ఈపాడు కార్పోరేషన్ రోడ్లమీద ఆఫీసులకెళ్ళి వస్తుంటే ఏరోజు కారోజు తిరిగి ఇంటికొస్తారో లేదోనని మేము హడిలి ఛస్తున్నాం సడెన్గా మీకేమయినా జరిగితే మాకు ఉంటానికో గూడయినా లేకపోతే ఎలా?" అని అంటూండేవారు.

వాళ్ళలా అంటున్న కొద్దీ మాకు సైకొలాజికల్గా భయం పెరిగిపోసాగింది. ఎందుకంటే ట్రాఫిక్ పోలీసుల చేతగానితనం వల్ల హైద్రాబాద్లో ఎన్ని రోడ్ ప్రమాదాలు జరుగుతాయో మేము చూస్తూనే ఉన్నాం. లారీలు బస్స్టాప్లో స్కూలుకెళ్ళడానికి నిలబడ్డ స్కూల్ పిల్లల మీద కెక్కేయటం, రోడ్పక్కనే ఉన్న రిక్షాల్నీ అందులో ఉన్న మనుష్యుల్నీ దున్నేయటం, ఆటోవాళ్ళకు ఆత్మహత్యలు చేసుకోవాలనిపించి నప్పుడల్లా ప్రయాణీకుల్ని ఎక్కించుకుని శరవేగంతో ఆటో నడిపి పల్టీలు కొట్టించేయడం, హైదరాబాద్ గూండాలకు ప్రభుత్వ సారా ఎక్కువయి నప్పుడల్లా కత్తులు తీసుకుని రోడ్డున పోయేవారి నందరినీ కత్తులతో పొడిచి పారేసి డాన్స్ చేయటం ఇలా ఎన్నో విధాల పౌరులను అంతంచేసే సరికొత్త విధానాలు ప్రభుత్వం రూపొందిస్తోంది కదా!

"ఈ పరిస్థితుల్లో మనం ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటే బావుంటుంది" అన్నాడు శాయిరామ్ ఉత్సాహంగా. ఈ విధంగా నయినా మీటింగ్ ఏర్పాటు చేసి మైక్ ముందు విన్యాసాలు జరపాలని అతని ప్లాన్!

అయితే ఈ విషయం మాకందరికీ తెలియటం వల్ల మేము అతని మాటలు కొట్టి పారేశాం. అయినా శాయిరామ్ అంత తేలిగ్గా పట్టు సడలించే రకం కాదు.

ఆడాళ్ళందరికీ 'సొంతిల్లు– సొంత స్థలం' అంటూ ఏవేవో ఆశలుపెట్టి వాళ్ళ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేయించేశాడు. ఇక గత్యంతరం లేక ఆదివారం నాడు మహాభారత్ టీవీ సీరియల్ అయ్యాక మేము కూడా సమావేశానికి చేరుకోక తప్పలేదు.

శాయిరామ్ అప్పటికే మైక్ముందు నిలబడి ఆదిమానవుల కాలం నుంచీ మనిషి దశల వారీగా 'ఇల్లు' అనేదానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తోంది వివరిస్తున్నాడు. మధ్యమధ్యలో కాలనీ గేయ రచయిత 'ఇల్లు' అనే శీర్షికతో గేయాలు– ఛాన్స్ దొరికి నప్పుడల్లా వినిపిస్తున్నాడు.

ఆఖర్లో "మీ అందరికీ సొంతింటి స్థలాలు కావాలనే అనుకుంటున్నారా?" అని ప్రశ్నించాడు శాయిరామ్.

"కావాలీ కావాలీ" అని అరిచారందరూ.

"ఆ కార్యక్రమం చూడ్డానికి కమిటీకే అధికారం ఇద్దాం" అన్నాడు బగారా బైగన్ వెంకట్రావ్. మిగతా వాళ్ళంతా అతని సూచనను సపోర్ట్ చేశారు.

"ముందు మన కాలనీవాళ్ళకు ఏ ఏరియాలో స్థలాలు కావాలో నిర్ణయిస్తే బాగుంటుంది."అన్నాడు రంగారెడ్డి.

"ఆబిడ్స్' అని అరిచారు కొంతమంది. మరికొంతమంది మెహిదీపట్నం అన్నారు. ఇంకొంత మంది 'చిక్కడపల్లి' అంటూ అరిచారు. ఇలా వాళ్ళు చదివిన పేర్లన్నీ విన్నాక రంగారెడ్డి లేచి నిలబడ్డాడు మళ్ళీ.

"సోదర సోదరీ మణులారా, అబిడ్స్లోనూ గండిపేటల్లోనూ ఉండాలను కోడానికి మనమేం రాష్ట్ర ముఖ్యమంత్రులం కాదు! వ్యాపారస్తులం అంతకన్నా కాదు. కనీసం మనం గూండాలమయినా, గవర్నమెంట్ స్థలాలు ఉచితంగా ఆక్రమించే వాళ్ళం. మనలాంటి మిడిల్ క్లాస్ పక్షులు సిటీలో ఉండటం అసాధ్యం. నగర శివార్లలోఅయితేనే మన ఆర్థికస్థోమతుకి తగ్గ స్థలాలు దొరకుతాయి. కనుక మీరిలా గొంతెమ్మ కోర్కెలు కోరటం మానేయాలి!" అన్నాడు హేళనగా.

"అయితే ఆ గొడవంతా కూడా మీరే చూసుకోండి" అంటూ అరిచారు కొంతమంది.

ఆ రోజునుంచీ మేము స్థలాల కోసం వేట ప్రారంభించాం! బాంబే హైవేలో ముప్పయ్ కిలోమీటర్ల దూరంలోనూ, విజయవాడ హైవేలో ముప్పయ్ కిలోమీటర్లల దూరం లోనూ, నాగార్జునసాగర్ రోడ్డుమీద పదిహేను కిలోమీటర్ల దూరంలోనూ, ప్లాట్లు ఉన్నట్లు పేపర్లలో ప్రకటనలు చూశాం.

"ముందు బాంబే హైవే సైడ్ చూడటం మంచిది. ఎందుకంటే ఇండస్ట్రీస్ అన్నీ

అటే ఉన్నాయి గనుక మన పిల్లలకు ఉద్యోగాలు అవీ దొరకాలంటే అటే ఉండాలి" అన్నాడు శాయీరామ్. ఆ మాట కరక్టేనని అందరూ ఒప్పుకున్నారు.

దాంతో ఓ ఆదివారం ఆ ప్లాట్లు అమ్మే ఆఫీస్‌కి చేరుకున్నాం. ప్లాట్లు చూపించడానికి పదిహేను మంది పట్టే మెటడార్ వాన్‌లో ముప్పయ్ మందిని ఇరికించి తీసుకెళ్ళారు వాళ్ళు.

మెయిన్‌రోడ్ నుంచి అయిదారు కిలోమీటర్లు కొండ మీదా గుట్టల మీదా నడిచాక ఇళ్ళస్థలాలు ఉన్నాయ్.

చుట్టూ కనుచూపు మేర ఒక్కపిట్ట కూడా కనిపించటం లేదు.

ఈలోగా ఆ ప్లాట్ల డీలర్ ఓ స్పీకర్ తీసుకుని మమ్మల్నందరినీ ఉద్దేశించి మాట్లాడసాగాడు.

"సోదరులారా! ఈ కాలనీ పేరు గోల్డ్‌హిల్ కాలనీ! ఈ కాలనీలో ప్లాట్లు తీసుకుంటే మీ భవిష్యత్తు బంగారపు కొండగా మారుతుందన్న నమ్మకంతో ఈపేరుపెట్టాము. ఈ కాలనీకి నాలుగు వేపులా నాలుగు అద్భుతమయిన ప్రాజెక్ట్‌లు రూపుదిద్దు కోబోతున్నాయ్. భవిష్యత్తులో సౌత్ బోర్డర్‌లో మన పార్లమెంట్ సమావేశాలు, సౌత్‌లో జరపాలనే ఉద్దేశంతో పార్లమెంట్ భవనాలు కట్టే ప్రపోజల్ ఉంది. నార్త్‌సైడ్ ఎయిర్‌పోర్ట్ రెండువేల ఎకరాల్లో కడుతున్నారు."

మేము ఉలిక్కిపడ్డాం.

"ఎయిర్‌పోర్ట్ ఇక్కడ కడుతున్నారా?" అడిగాడు గోపాల్రావ్ ఆశ్చర్యంగా.

"అవును!"

"ఎందుకు? బేగంపేటలో ఉందికదా?"

"అది చాలటం లేదు. ఇంకో వంద బోయింగ్ విమానాలకు మొన్నే ఆర్డర్ చేశారు. అవి వచ్చాయంటే వాటి పార్కింగ్‌కి ప్లేస్ వుండదు. మెయిన్‌రోడ్ పక్కన పార్క్ చేయడానికి కార్పోరేషన్ వాళ్ళు వప్పుకోవటం లేదట. అందుకని వాటి పార్కింగ్ కోసం ఇక్కడ ఇంకో ఏరోడ్రమ్ కడుతున్నారు."

గోపాల్రావ్‌కి అతని మాటల మీద నమ్మకం కలగలేదు.

"అలాంటి ప్రపోజల్ ఏమయినా వుంటే ముందు నాకు తెలుస్తుంది కదా! మా న్యూస్ పేపర్ వాళ్ళకు తెలీందేముంటుంది?" అన్నాడు అనుమానంగా.

"ఆ ఇన్‌ఫర్మేషన్ మాకు సీక్రెట్ దొరికింది– ఇకపోతే ఈస్ట్‌సైడ్ న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ వస్తోంది".

"అదేమిటీ? మౌలాలీ దగ్గర ఒకటుందిగా?"

అతను కలవరపడ్డాడు.

"మౌలాలీ దగ్గర ఉండా? ఎక్కడ?" అతను పక్కవాళ్లను కన్సల్ట్ చేశాడు.

" సారీ జెంటిల్మెన్! న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ మౌలాలీ నాచారం మధ్య వున్నట్లు నాకిప్పుడే వర్తమానం అందింది. అంచేత ఈస్ట్సైడ్ కర్షక పరిషత్ ఆఫీస్ వందకోట్ల కాపిటల్తో పెడుతున్నట్లు తెలిసింది."

ఈసారి ఎవరూ ఆశ్చర్యపోలేదు. అందరూ ఘొల్లున నవ్వారు

దాంతో అతను ఉపన్యాసం మానేసి బిజినెస్లోకి దిగిపోయాడు.

కొంతమందిని వెంబడి తిప్పుతూ మధ్యమధ్యలో మావేపు చూపిస్తూ ప్లాటు నెంబర్లున్న సర్వేరాళ్ళ చుట్టూ తిరుగుతున్నాడు. మేమందరం గుమిగూడి మాలో మేము డిస్కస్ చేసుకో సాగాము.

"అంతా బోగస్! ఎయిర్పోర్టూ లేదు. పార్లమెంటు భవనాలూ లేవు మనల్నందర్నీ టెంప్ట్ చేసి కొనిపించటానికి ప్రయత్నిస్తున్నాడు వాడు" అన్నాడు రంగారెడ్డి.

"అదీగాక మనం ఈ ఏరియాలో ప్లాట్లు కొన్నామంటే ఈ ఏరియాకు చెందిన డెకాయిట్స్ దయమీద ఆధారపడి బ్రతకాల్సిందే" అన్నాడు శాయీరామ్.

ఆ మాట వినడంతోనే అందరి గుండెలూ ఝల్లుమన్నాయ్.

"అవును! ఇక్కడ స్థలాలు కొనటం చాలా రిస్క్! ఖర్మ కాలి ఎవడయినా నా కథలూ, కవితలున్న ఫైల్స్ ఎత్తుకుపోయాడంటే నేను ఘోరమయిన దెబ్బతింటాను. వాడు ఓ రచయితగా వెలిగిపోతాడు" అంది రాజేశ్వరి

అసలీ ఏరియా ఇంకో పాతికేళ్ళ వరకూ డెవలప్ కావటం అసంభవం" అన్నాడు గోపాల్రావ్. హఠాత్తుగా ఆ ప్లాట్స్ ఏజెంట్ మా దగ్గర కొచ్చాడు.

"మీరే ప్లాట్స్ బుక్ చేసుకుంటున్నారా?" అడిగాడతను పెన్సిల్ పుస్తకం తీసుకుని. మేమెవ్వరం మాట్లాడ లేదు.

"చెప్పండి! మీ కాలనీవాళ్ళకు గజానికి రెండ్రూపాయలు కన్సెషన్ కూడా ఇస్తున్నాను."

"మా కొద్దు" అన్నాడు గోపాల్రావ్.

"వద్దా? ఎందుకని?"

"ఈ ఏరియా ఇప్పట్లో ఛస్తే డెవలప్ కాదు"

"ఎందుకని ?"

"మాకు కొంచెం కామన్సెన్స్ ఉంది గనుక" అతనికి కోపంవచ్చింది.

"సరే! కొంటే కొనండి లేకపోతే లేదు. కానీ తరువాత కే.వీ.భాస్కర్ లాగా పశ్చాత్తాపడాల్సి వస్తుంది మీరు"

"కే.వీ. భాస్కర్ ఎవరు?" ఆత్రుతగా అడిగాం అందరం.

"అతను కూడా పదేళ్ళ క్రితం అచ్చం మీలాగానే చౌకగా వచ్చిన స్థలం కొనను

పొమ్మన్నాడు. ఇప్పుడు రోజూ ఆ స్థలం చుట్టూ తిరిగి భోరున ఏడుస్తూంటాడు."

"ఎక్కడుందా స్థలం?"

"ఆబిడ్స్‌లో"

అందరం కొద్దిక్షణాలపాటు నోరు తెరిచేశాం.

"కమాన్! ఆలోచించండి! తలో అయిదువేలూ అడ్వాన్స్ కట్టండి! అంతే! మిగతా మొత్తం ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ఇవ్వవచ్చు."

మేము వప్పుకోలేదు.

"మాకవసరం లేదు. నాగార్జునసాగర్ రోడ్ మీద ఇంతకంటే మంచి ప్లాట్లు వున్నాయని తెలిసింది. అక్కడికెళ్తాం" అన్నాడు గోపాల్రావ్.

"వెళ్ళండి! అవి కొంటేగాని మీకు తగిన శాస్తి జరగదు" అన్నాడతను కసిగా.

మేము అతని మాటలు వినిపించుకోకుండా నాగార్జునసాగర్ రోడ్‌లో పన్నెండు కిలోమీటర్ల దూరం వెళ్ళాము. ఆ ప్లాట్లు ఒక్కసారి చూడటంతోనే అందరికీ ఎంతో నచ్చాయి. పైగా ఆ ప్లాట్లలో నాలుగిళ్ళు కూడా కట్టించి వున్నాయ్ అందరం ప్లాట్లు చూసి ఎవరేది కావాల్సిందీ సెలక్టు చేసుకున్నాం.

"ఈ ప్లాట్ల వెనుక వేపు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఒకటి వెయ్యి ఎకరాల స్థలంలో కడుతున్నారు" చెప్పాడు బ్రోకర్.

అందరం అప్పటికి తెలివి మీరిపోవటం వల్ల ఘెల్లున నవ్వాం.

"ఏమిటి నవ్వుతున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అదే మీరు చెప్పిన పిల్లల కథ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్."

"అంటే నా మాట అబద్దమంటారా?"

"అహ్హాహ్హాహ్హా" అంటూ నవ్వాం మళ్ళీ.

అతినిమొఖం కందిపోయింది.

"గజం ఎంత?" అడిగాడు జనార్ధన్

"పాతిక రూపాయలు."

అందరం ఆశ్చర్యంగా మొఖాలు చూసుకున్నాం.

ఎందుకంటే పాతికరూపాయల్లో ఇంటి స్థలాలు దొరుకుతాయన్న విషయం మాకంతవరకూ తెలీదు. కనీసం యాభయ్ రూపాయలు ధరలేందే స్థలం అనేది హైద్రాబాద్ చుట్టుపక్కల అడవిలోనయినా దొరకదు.

"పాతిక రూపాయలా?" అనుమానంగా అడిగాం.

అతను మమ్మల్ని అపార్ధం చేసుకున్నాడు.

"సరే మీరంతగా అడుగుతున్నారు కాబట్టి ఇరవై చేసుకోండి." మాకు స్పృహ తప్పినంత

పనయింది. నోటమాట పెగలటం లేదు.

వెంటనే తలో అయిదువేలూ అడ్వాన్స్ కట్టాలని నిర్ణయించుకున్నాం.

"ఎందుకయినా మంచిది డబ్బిచ్చే ముందు ఓసారి ఆ నాలుగిళ్ళ వాళ్ళనూ కలుసుని వద్దాం పదండి" అన్నాడు రంగారెడ్డి.

అందరం రంగారెడ్డి వెంట ఆ ఇళ్ళ దగ్గరకు నడిచాం.

ఆ ఇళ్ళముందే కూర్చుని కనిపించారా ఇళ్ళ వాళ్ళు. మమ్మల్ని చూడగానే పరుగుతో వచ్చి చుట్టూ మూగిపోయారు వాళ్ళ పిల్లలు

వాళ్ళ చిరిగిపోయిన బట్టలూ, చింపిరి తలలూ చూసేసరికి మాకు భయం వేసింది

"సార్! ఆ వాటర్ బాటిల్లో నీళ్ళివ్వరా? సార్! గుక్కెడు నీళ్ళు కావాల్సార్! 24 గంటలయి పోయింది సార్ నీళ్ళు తాగి" అంటూ బ్రతిమాల సాగాడో కుర్రాడు.

అందరి బాటిల్స్‌లో నీళ్ళూ అందరికీ తాగిస్తూంటే పెద్దాళ్ళు కూడా పరుగుతో వచ్చి ఆ నీళ్ళు అందుకని ఆశగా తాగసాగారు.

"ఏమిటి ఈ ఇళ్ళు మీవేనా?" అడిగాడు రంగారెడ్డి వాళ్ళల్లో ఒకతనిని.

"అవున్సార్" ధీనంగా అన్నాడతను.

"మరి నీళ్ళ కోసం ఇలా మొఖం వాచినట్లు గుమికూడుతున్నారేమిటి?"

అతను ఇంక దుఃఖం పట్టలేకపోయాడు. ఛటుక్కున కూలబడి బావురుమని ఏడ్చేయ సాగాడు మాకు భయం పట్టుకుంది ఇదెక్కడి గొడవరా నాయనా అని.

"అరె! అలా ఏడుస్తావేమిటయ్యా! ఏం జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అది 1988వ సంవత్సరం బాబూ" అన్నాడతను.

మాకు గుండెలవిశిపోయినయ్‌– ఫ్లాష్‌బాక్ మొదలెడుతున్నాడేమోనని. ఎందుకయినా మంచిదని రెండడుగులు వాన్‌వేపు వేశాం. కానీ అతనా విషయం గ్రహించేశాడు.

"ఫ్లాష్‌బాక్ చాలా చిన్నది సార్! అది 1988వ సంll సెప్టెంబరు నెల. మేమప్పుడు మీలాగానే ఇస్త్రీ బట్టలతోనూ జేబులో అయిదారు పదిరూపాయల నోట్లతోనూ, పిల్లాపాపలతోనూ సుఖంగా వుండే వాళ్ళం. కానీ మా సుఖం చూసి ఓర్వలేని ఓ ఇంటి స్థలాల బ్రోకరు మాదగ్గర కొచ్చాడు. అంతే! వాడి మాయలో పడిపోయాం. నగలు తాకట్టుపెట్టి స్థలం కొన్నాం. ప్రావిడెంట్ ఫండ్‌లూ ఇతర హౌసింగ్‌లోన్లూ తీసుకుని ఇళు ళ్ళ కట్టాం. అప్పుడు బోర్‌వెల్ కథ ప్రారంభమయింది సార్" మళ్ళీ భోరున ఏడ్వ సాగాడతను. కథ సగంలో ఆపటం ఇష్టం లేక అతనిని ఓదార్చాం అందరం.

'మొదటి బోర్‌వెల్ ఫెయిలయింది సార్! వాటర్ డివైనర్‌తో ఇంకోచోట బోర్ వేయించాం! అది నూటడెబ్భై అడుగులలోతు కెళ్ళి రాతిని కొట్టుకుంది. అప్పటికే మేము

అడుక్కుతినే స్థితికొచ్చాం. ఆ తరువాత మూడో బోర్‌వెల్ మూడొందల యాభై అడుగులు లోతు కెళ్ళింది. కాని ఒక్కచుక్క నీరు కూడా దొరకలేదు. అప్పుడు తెలిసింది సార్! ఈ ఏరియాలో ఎక్కడా ఒక్కచుక్క నీళ్ళు రాదని! కానీ ఏం చేస్తాం? తెగ నీరుందని మమ్మల్ని నమ్మించి ఈ గుంటలో పడిన వర్షపు నీరు చూపించి మమ్మల్ని మోసం చేసేశాడు వాటి ఓనర్. అప్పటి నుంచీ ఈ ఇళ్ళను వదులు కోలేక ఆరు కిలో మీటర్ల దూరం నీళ్ళు తెచ్చుకు తాగలేక జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నాం సార్."

మాకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయ్.

కోపంగా మాకా స్థలాలు చూపించిన బ్రోకర్ వేపు చూశాం.

అతను తడబడ్డాడు.

"అబ్బే! మన స్థలాల్లో ఏం ప్రాబ్లమ్ లేదు సార్! వందడుగుల్లోపే నీరు పడుతుంది.""

"నీకెలా తెలుసా విషయం?"

"వాటర్ డివైనర్‌తో టెస్ట్ చేయించాం"

"మరి వాళ్ళూ ఆ టెస్ట్ చేయించారుగా"

"ఇదిగో చూడండి సార్! తీసుకుంటే తీసుకోండి. లేకపోతే లేదు. మీరు గాకపోతే ఇంకోళ్ళ కమ్మేస్తాను" అన్నాడతను కోపంగా.

ఆ తరువాత ఇంకో రెండు స్థలాలు చూశాక చివరికి విజయవాడ హైవేలో ముప్పయ్ కిలోమీటర్ల దూరంలో ఉన్న స్థలాలు తీసుకున్నాం అందరం. రంగారెడ్డికి ఉచితంగా సంక్రమించిన స్థలం అక్కడే ఉండటం ఒక కారణం. రెండో కారణం అది నేషనల్ హైవేకి కొంచెం దగ్గరగా ఉంది. మూడో కారణం ఆ ఏరియా తాలుకూ డెకాయిట్ గాంగ్ లీడర్ మా గోపాల్రావ్‌కి బాగా తెలిసినవాడు. అతని ఇంటర్‌వ్యూ ఒకటి గోపాల్రావ్ ఈ క్షణం డెయిలీ పత్రికలో పబ్లిష్ చేశాడు. నాలుగో కారణం అక్కడ ఇండస్ట్రీస్ లేవు! కనుక చెడుగాలీ, చెడు నీరూ ఉండదు. అయిదో కారణం ఆ ఏరియా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి అయే అవకాశం ఉందని చాలా మంది అంచనా! ముఖ్యమంత్రి అయితే ఇంక ఈ ఏరియా ఎలా డెవలప్ అయిపోతుందో మాకు బాగా తెలుసు

చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనింటి కెళ్ళేదారి విశాలంగా చక్కని పూల మొక్కలతో నిండిపోవటం మేం చూశాం. అంజయ్య ముఖ్యమంత్రి అయినప్పుడు ఆయనున్న ఏరియా ఎలా బాగుపడిందో మాకు తెలుసు. అలాగే ఎన్.టి.ఆర్. ముఖ్య మంత్రి అవగానే గండిపేట రోడ్ ఎలా తకీమని మారిపోయిందో కూడా మేము చూస్తూనే ఉన్నాం.

పెళ్ళాల నగలు తాకట్టుపెట్టి పి.ఎఫ్.లోన్లు, సొసైటీ లోన్లు, అన్నీ తీసుకుని స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నాం. ఆ తర్వాత హౌసింగ్ లోన్ కోసం అందరం అప్లయ్

చేశాం.

హౌసింగ్ లోన్ అంటే చాలా తేలిగ్గా వస్తుందని మేమనుకున్నాం. కాని దానివల్ల మనిషి ఎంత నరకం అనుభవిస్తాడో మాకు అప్పుడే తెలిసింది. మా డిపార్ట్‌మెంట్ వాళ్ళే మమ్మల్నంత హింసలుపెడతారని మేము కలలో కూడా అనుకోలేదు.

ముందు అర్బన్ లాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ క్లియరెన్స్ సర్టిఫికెట్ తెమ్మన్నారు తర్వాత హుడా క్లియరెన్స్ అన్నారు. అంతే! హుడా ఆఫీస్ చుట్టూ రెండేళ్ళు తిరిగాం తర్వాత నాన్ ఎన్‌కంబరెన్స్ అన్నారు. దాని తర్వాత పహాణి పట్టా అన్నారు.

దురదృష్టవశాత్తు మనకి సర్టిఫికెట్స్ ఇచ్చే ఆఫీస్‌లన్నీ స్టేట్ గవర్నమెంట్ ఆధీనంలోనే ఉన్నాయ్.

మరి స్టేట్ గవర్నమెంట్ ఆఫీసుల్లో సర్టిఫికెట్లు సంపాదించాలంటే ఎంతటి భయం కరమయిన పరిస్థితిల్లో చిక్కుకు పోతామో మా అందరికీ తెలుసు. ముందు వాళ్ళు మనల్ని ఉసుళ్ళు అనే పురుగుల్ని చూసినట్లు చూస్తారు.

"ఏం కావాలి?" అని అసహ్యించుకుంటూ అడుగుతారు.

"అప్లికేషన్ ఇచ్చిపో" అంటూ బిచ్చగాడిని కసురుకున్నట్లు కసుర్తారు.

పదిరోజుల తరువాత "ఏం అప్లికేషనూ?" అనడుగుతారు.

మనం ఈసారి వందనోట్లు ఒకటో రెండో ఇస్తాం. ఇచ్చినా గాని సరిగ్గా మాట్లాడరు. తర్వాత కనబడు అంటారు చిరాకుగా మొఖంపెట్టి.

"మేము లంచం ఇచ్చాం కదా?" అంటాం మనం- లంచం సంగతి గుర్తుచేస్తూ.

"ఏమిచ్చావ్?" అంటారు వాళ్ళు ఇంకా చికాకుగా.

"అదే" అంటాం మనం అందరిలో చెప్పటం ఇష్టంలేక.

"అదే అంటే?" అడుగుతారు వాళ్ళు.

"మీకు టూ హండ్రడ్ ఇచ్చాను మొన్న" అంటారు మీరు.

"ఇస్తే వీళ్ళందరూ ఇచ్చినోళ్ళు కాదా? నువ్వేం దిగివచ్చావా? బయట కూర్చో" అంటారు. ఈ బాధలన్నీ అనుభవించాక దేనికయినా ఓ హద్దు ఉంటుందన్న విషయం మాకు తెలిసొచ్చింది. మరి ఆ ఆఫీసుల్లో లంచానికి హద్దులు లేవు గనుక, మా సహనానికి హద్దులున్నాయి గనుక మేం డిపార్ట్‌మెంట్ లోన్స్ కోసం పెట్టిన అప్లికేషన్ సంగతి మర్చిపోయాం.

మళ్ళీ ఏవో తంటాలుపడి నగలు తాకట్టు పెట్టి బేస్‌మెంట్ వేయటం మంచిదని రంగారెడ్డి సలహా ఇచ్చాడు.

అలా చేస్తే తర్వాత ఆ అప్పులు తీరిపోయాక మళ్ళీ అప్పులు చేసి రూఫ్ వరకూ వేయటం, ఆ తర్వాత మళ్ళీ అప్పులు చేసి మిగతాది కంప్లీట్ చేయడం, సరయిన

పద్ధతని ఇంకొంతమంది కూడా అనేసరికి మేమందరం ఆ కార్యక్రమం అమలు పరచాలని నిశ్చయించుకున్నాం.

ఓ మంచిరోజు చూసుకుని భూమి పూజలు చేయడానికి మా కాలనీ తాలుకూ ఆడా, మగా, పిల్లా, పీచూ అందరం మా స్థలాల దగ్గరకు బయలుదేరాం.

మా ఆడాళ్ళందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారు.

"మా స్థలంలో భూమిపూజకెళ్తున్నాం పిన్నిగారూ! ఎప్పటికయినా సొంతిల్లనేది కట్టుకుంటే గానీ సుఖం ఉండదు కదా! ఇక్కడ చూడండి! ఈ కాలనీలో అన్నింటికీ నానా చావూ ఛస్తున్నాం! ఒక గాలీ, వెలుతురూ లేదు. నీళ్ళు ఉండవ్. ఛఛ!" అంటూ చాలా హాపీగా చెప్పారు.

అయితే బస్‌లో హయత్‌నగర్ దాటేసరికి వాళ్లల్లో ఉత్సాహం క్రమేపీ తగ్గిపో సాగింది.

"ఇంకెంత దూరమండీ?" అంటూ ఆత్రుతగా అడగ సాగారు.

హయత్‌నగర్‌లో దిగాక ఇంకో బస్‌కోసం నిలబడేసరికి వాళ్ళ కళ్ళల్లో కాంతి పూర్తిగా పోయింది. మొఖాలు వాడిపోయినయ్.

తీరా మరో బస్‌లో కొంతదూరం వెళ్ళి అక్కడ దిగి రెండు కిలోమీటర్లు మట్టి రోడ్ మీద నడవాలనేసరికి వాళ్ళకు నీరసం వచ్చేసింది.

"ఏమిటి? అడవిలోనా మీరు స్థలాలు కొన్నది?" అంటూ విరుచుకుపడ్డారు.

"ఇల్లు కట్టుకుని మీ మగాళ్ళే ఉండండక్కడ! మేము ఛస్తేరాము" అనేశారు. ఎలాగయితేనేం అక్కడ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్ వస్తోందనీ, ఎనిమిది కాలేజీలూ, రెండు పబ్లిక్ స్కూళ్ళూ ఓ బస్ డిపో, ఓ రింగు రోడ్డూ– ఇలాంటివన్నీ వస్తున్నాయని అబద్ధం చెప్పాక కొంత శాంతించారు.

తీరా స్థలాల దగ్గరకు చేరుకునేసరికి అక్కడి దృశ్యం చూసి మా గుండెల విసిపోయినయ్.

మా ప్లాట్లల్లో వరుసగా పాతిక గుడిసెలు వేసి వున్నాయ్.

ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఎక్కడయినా ఓ గుడిసె కనిపించిందీ అంటే దానర్థం జంట నగర వాసులందరికీ క్షుణ్ణంగా తెలుసు.

ఆ గుడిసెలో ఓటు హక్కున్న ఓ ఫౌరుడుంటాడు. అతని వెనుక ఆ ఏరియాలో పేరుమోసిన ఓ గూండా వుంటాడు. ఆ గూండా వెనుక ఆ నియోజకవర్గం తాలూకూ ఎమ్మెల్యేగానీ, ఎం.పీ. గానీ ఉంటాడు. వాళ్ళిద్దరి వెనుకా ఓ రాజకీయ పార్టీ ఉంటుంది. పార్టీ వెనుక ప్రభుత్వం ఉంటుంది.

అందుకే మా అందరికీ సగం ప్రాణాలు పైనే పోయాయి మా అందరికీ మాటపడి పోయింది. చూపు పవర్ తగ్గిపోయింది. కాళ్ళూ చేతులూ సన్నగా వణుకుతున్నాయి.

"మన ప్లాట్లల్లో గుడిసెలు ఉన్నాయేమిటి?" భయంగా అడిగాడు రంగారెడ్డి.

"అదే ఆశ్చర్యంగాఉంది. మనం కొని ఎన్నోరోజులు కూడా అవలేదు" దిగులుగా అన్నాడు శాయిరామ్.

"పదండి! వాళ్ళెవరో ఏమిటో కనుక్కుందాం!" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

అందరం గుడిశెలకు సమీపంగా వెళ్ళాం.

బాగా దగ్గరకెళ్ళాక మాకు కనిపించినయ్ రెండుబోర్డ్లు పక్కపక్కనే!

ఎన్టీఆర్ నగర్! రాజీవ్ గాంధీనగర్!

కొంతమంది ఆ గుడిశెల ముందు కూర్చుని ఏదో చర్చించుకుంటున్నారు. వాళ్ళ దగ్గరకు నడిచాం అందరం.

"ఎవరివయ్యా ఈ గుడిశెలు?" అడిగాడు గోపాల్రావ్ ధైర్యం తెచ్చుకుని.

అందరూ మాట్లాడుకోవటం ఆపి మా వేపు విచిత్రంగా చూశారు గానీ ఏమీ మాట్లాడలేదు.

"మిమ్మల్నేనయ్యా అడిగేది? ఎవళ్ళవీ గుడిశెలు?" తనూ గట్టిగా అరిచాడు యాదగిరి.

"మావే! ఏం సంగతి?" ఒకడు మావేపు సీరియస్‌గా చూస్తూ అడిగాడు.

"ఏం సంగతేమిటయ్యా! మా వాళ్ళందరం కలసి ఇక్కడ ప్లాట్లు కొనుక్కుంటే మీరందులో గుడిశెలు వేస్తారా? ఎవర్నడిగి వేశారిక్కడ?"

ఈసారి కొంతమంది గుడిశెల్లోని స్త్రీలూ, పిల్లలలూ బయటికొచ్చి మూగారు మా చుట్టూ కూర్చున్న వాళ్ళల్లో ఒకతను లేచి మా దగ్గరకొచ్చాడు.

"ఈ ఇండ్ల స్థలాలు మీవా?" వెటకారంగా అడిగాడు.

"అవ్!"

"అయితే ఇండ్లెందుకు కట్టలేదయ్యా?"

"మా ఇష్టమొచ్చినప్పుడు కట్టుకుంటామయ్యా! మీకెందుకా సంగతి?"

"మా కిప్పుడే ఇష్టమయినాది. మేం కట్టినాం! మీకేమాయే మళ్ళా?"

"కట్టుకో కానీ నీ స్థలంలోనే నువ్వు కట్టుకోవాలయ్యా!"

"ఇది మా జాగానే! ఎవళ్ళు కాదంటారు?"

మేము అదిరిపడ్డాము.

"ఆ! ఇవి మీవా?"

"అవ్!"

"ఏవి? డాక్యుమెంట్స్ చూపించండి"

"నువ్వెవళ్ళు అన్నీ సూపనికి? ఇది మా జాగా! మేము కట్టుకున్నాం"

యాదగిరికి వళ్ళు మండిపోయింది.

"ఏయ్! ఈడ కెళ్ళి గుడిశెలు తీస్తారా లేదా?"

"ఏయ్ నీకేం దమాకున్నాది బే? నువ్వెవడ్రా– గుడిశెలు తీయ మననికి?"

"ఏందిరా! దమాకున్నదా అనడుగుతావ్ బే– సాలే! ఈ జాగాలో ఇండ్లు కట్టి ఇంక మీదికెల్లి నకరాలు జేస్తున్ను బే" అంటూ యాదగిరి వాళ్ళ మీదకు వెళ్ళబోయాడు కానీ మేము వెనుకకు లాగేశాం.

ఎందుకంటే అవతల వాళ్ళ మెజారిటీ ఎక్కువ ఉంది.

"మనం మంచిగ జెపితే వినరన్నా! మనమే ఈ గుడిశెలన్నీ పీకిపారేయాలి. అప్పుడుగానీ సుధరాయించరు కొడుకులు–"

యాదగిరి మాటలు పూర్తి కాకుండానే అందరినీ వెనక్కు నెట్టుకుంటూ, తాగిన మైకంలో తూలుతూ లావుగా, పొడుగ్గా ఉన్న ఓ వ్యక్తి మా ముందుకొచ్చి నిలబడ్డాడు.

"ఏమ్ బిడ్డా! గీ ఇండ్లన్నీ పడేస్తావ్? అంత ధైర్యమున్నది బే నీకు?" అడిగాడతను కోపంగా.

అతన్ని చూసేసరికి మా గుండెల విసిపోయినయ్.

అతను మరెవరో కాదు. తరచుగా ఆ ఏరియాలో తనసైన్యంతో వీరవిహారం చేసే పాండూ దాదా!

యాదగిరి కూడా అతనిని చూడగానే చల్లబడిపోయాడు.

"అది కాద్సార్! ఇవ్వన్నీ మా ఇండ్ల స్థలాలు! అందులో వీళ్ళు గుడిశెలు వేసిన్రు" జవాబిచ్చాడు యాదగిరి.

"అరే హౌలే! ఈ గుడిశెలన్నీ నేనే ఏపిచ్చినా? సమజైందా?"

"కాని ఇవి మేము కొనుక్కున్న హౌసింగ్ ప్లాట్స్ కదండీ! ఇందులో గుడిశెలు వేస్తే ఎలా?"

"ఇది గవర్నమెంట్ లాండ్! మీరెట్లా కొంటారువయ్యా?"

"గవర్నమెంట్ లాండ్ కాదు! భూపాల్‌రెడ్డి దగ్గరకొన్నాం! ప్రైవేట్ లాండిది! కావాలంటే మీకు డాక్యుమెంట్స్ తెచ్చి చూపిస్తాం"

అతను ఓ క్షణం ఆలోచించాడు"

"మరి మావోడు గవర్నమెంట్ లాండ్ అని జెప్పిండే! ఇగో! ప్రెవేట్‌గానీ, గవర్నమెంట్‌గానీ దాన్తోటి మనకేం పనిగానీ ఆళ్ళు గరిబోళ్ళు! గుడిశె లేసుకున్రు! ఆళ్ళ నిప్పుడు పొమ్మంటే ఏడకు బోతారువయ్యా!"

మా గుండెల్లో రాయిపడింది.

"మేము మాత్రం పైసులన్నోళ్ళం కాదు కదండీ! గవర్నమెంట్ సర్వెంట్స్‌మి! మా గతేం కావాలి మరి?"

"మీ గవర్నమెంటోళ్ళకు పైసలకేం తక్కువ? కాగితం కదలాలంటే పైసలు- కదలొద్దంటే పైసలు!ఇగో సూడు! మీరింకొక దిక్కేడయినా వేరే జాగాలూ కొనుక్కోండ్రి గాని ఈడకు రావద్దు! సమజైందా?"

"ఇదన్యాయమండీ! మేము చెమటోడ్చి సంపాదించుకున్న డబ్బుతో ప్లాట్లు కొనుక్కుంటే మీరిలా గుడిశలేయిస్తే ఎలా? మర్యాదగా ఈ గుడిశెలు తీయకపోతే పోలీస్ కంప్లయింటిస్తాం. ఆ!" ధైర్యం చేసి హెచ్చరించాడు శాయిరాం.

పాండూ దాదా పగలబడి నవ్వాడు.

"నీయవ్వ! ఇంత బేవకూఫ్ గాళ్ళేమయ్యా మీరు! పోలీస్ కంప్లెయింటిస్తారు? వాండ్లేం జేస్తరువయ్యా? వచ్చి గుడిశెలు తీస్తారు?"

మేమంతా రంగారెడ్డిని కోప్పడ్డాం! రౌడీల దగ్గర పోలీసులపేరెత్తితే వాళ్ళు మరింత రెచ్చిపోతారని మాకు తెలుసు. పోలీసుల మీద కోపంతోనూ, ఇతర గూండాల మీద కోపం తోనూ హైదరాబాద్‌లోని చాలామంది గూండాలు ఊరికే దారినిపోయే వారందరినీ పొడిచి పారెయ్యటం మేము ప్రత్యక్షంగా చూశాము. ఎన్నో సందర్భాల్లో వాళ్ళ చేతికి దొరక్కుండా తప్పించుకున్నాం కూడా.

"సారీ సార్! మారంగారెడ్డికేం తెలీదు! అతని మాటలు పట్టించుకోకండి! పోలీసోళ్ళేం జేస్తారండీ? వాళ్ళేం దాదాలా? గుడిశెలు ఏయించటానికి పీకటానికీనూ?" సర్ది చెప్పాడు శాయిరామ్.

"ఇగో! మంచిగ చెప్తున్నా ఇనండ్రి! ఈగుడిశె లీడకెళ్ళి తియ్యనికయితే గాదు. నేనొక్క సారి గుడిశెలేయించి నానంటే ఇంక చీఫ్ మినిష్టర్‌గాదు ప్రైమినిష్టరొచ్చినా గాని తియ్య! సమజయిందా?"

"అయింది సార్!"

"అయితే ఇంక ఫోండ్రి మరి"

ఇంక లాభం లేదని నేను కల్పించుకున్నాను.

"చూడండి భాయి సాబ్! మేము మీ ఏరియాలో మీ దయమీద ఆధారపడి బ్రతుకుతున్న వాళ్ళం! ఏనాడూ మేము పోలీసుల్నిగానీ, ప్రభుత్వాన్ని గానీ నమ్ముకున్న వాళ్ళం కాదు. కావాలంటే మా ఏరియాలో వుండే శంకర్‌దాదా నడగండి! అతనేం జెప్తే అది చేసేటోళ్ళం. కనుక మా పరిస్థితి కూడా మీ రాలోచించాలి మళ్ళీ ఇంకో స్థలం కొనే తాహతు మా దగ్గర లేదు. మీరు నమ్ముతారో నమ్మరో గానీ చాలామంది మా కాలనీవాళు ళ్ళ భార్య మెడలో వున్న గొలుసులు కాస్తా తాకట్టుపెట్టి ఈ స్థలాలు కొనుక్కున్నాం."

ధీనంగా మాట్లాడాను.

మేమాశించిన ఫలితం కనిపించిందతని మొఖంలో.

"అచ్చా! మీరు శంకర్‌దాదా ఏరియా వాండ్లా?" ఆప్యాయంగా అడిగాడు.

"అవునండీ"

"అయితే ఓపని జేయండ్రి. ఈ గుడిశెలయితే ఏసేసిన్రు మా వాళ్ళు! కనుక మీ ఇండ్ల జాగాలు మళ్ళీమీకే అమ్మేయమని మా వాండ్లతో జెప్తా. వాండ్ల దగ్గర మీజాగాలు మళ్ళీ కొనుక్కోండ్రి అప్పుడు ఈళ్ళకు వేరే జాగాలిస్తా నేను."

మాకు మతిపోనట్లయింది.

"ఏమన్నారు? వాళ్ళ దగ్గర మా స్థలాలు మేమే మళ్ళీ కొనుక్కోవాలా?"

"అవ్ మళ్ళా!"

"మా స్థలంలో అక్రమంగా వాళ్ళు గుడిశె లేసుకుంటే మళ్ళీ వాళ్ళ దగ్గర మా స్థలాలు మేము కొనుక్కోవట మేమిటి?"

"ఇష్టమయితేనే కొనండ్రి భాయ్! లేకుంటే పోండ్రి! జబర్దస్తేం లే"

అందరం మొఖామొఖాలు చూసుకున్నాం.

"పోనీలే! తలో రెండు వేలూ పడేస్తే వాళ్ళు వెళ్ళిపోతారు కదా! దాంతో గొడవ వదిలిపోతుంది" అన్నాడు శాయిరామ్ రహస్యంగా.

అందరం శాయిరామ్ ఆలోచనను సమర్థించాం.

"సరే సార్! అందరం తలో రెండువేలూ కడతాం! వాళ్లను ఖాళీ చేయించండి" పాండూ దాదా మళ్ళీ పగలబడి నవ్వాడు.

"నీయవ్వ! భలే బఫూన్లున్నారయ్యా మీరు. రెండువేల్రూపాయలకు రెండు గజాల స్థలం వస్తుందేమో! అది సరిపోతదా మీకు?"

"అది కాద్సార్ మా స్థలాలు ఖాళీ చేస్తున్నందుకు రెండువేల రూపాయలు చాలదా?"

"ష్! నేను చెప్పేది వినవయ్యా! ఈ ఏరియాల గిప్పుడు గజం నూటడెభై ధరున్నది. మీరు ఒరిజినల్ ఓనర్స్‌కదాని ఇరవై రూపాయలు కన్సెషనిస్తున్నాం! గజం నూట యాభై లెక్కన పైసలిద్దెచ్చి ఇయ్యండి. ఒక్కదినంల అందర్నీ లేపేసి వేరే జాగాలో గుడిశె లేయిస్తా!"

కొద్ది క్షణాలు మాకు నోటమాట రాలేదు.

"ఇదన్యాయం సార్! అంత డబ్బు పెట్టి మా స్థలాలు మేమే కొనుక్కోవట మేమిటి? అసలు మాదగ్గర అంత డబ్బేలేదు"

పాండూ దాదాకి కోపం వచ్చింది.

"ఏయ్! మంచిగా మాట్లాడ్తుంటే నకరాలు జేస్తున్రు బే! ఎళ్ళండ్రి నీయవ్వ– స్థలం లేదు, గిలం లేదు! ఈ గుడిశెలీడనే వుంటయ్. ఏంజేస్కుంటరో జేస్కోండ్రి" అంటూ వెనక్కు తిరిగి "అరేయ్! మళ్ళీ ఈళ్ళెవరయినా వచ్చి నకరాలు జేసిన్రంటే కాళ్ళూ చేతులూ ఇరగొట్టి, పంపించండి" చెప్పేసి వెళ్ళిపోయాడు వెనక్కి.

మేము నిశ్చేష్టులమయి అలాగే నిలబడిపోయాం.

గుడిశెల వాళ్ళందరూ ఎవర్దారిన వాళ్ళెళ్ళిపోయారు.

"ఏం చేద్దాం?" నీరసంగా అడిగాడు శాయిరాం కాసేపటి తర్వాత కోలుకుని.

"ముందు ఇంటికెళ్దాం పదండి. జ్వరం వచ్చినట్లుంది" అన్నాడు గోపాల్రావ్. అందరం నిశ్శబ్దంగా కాలనీకి బయలుదేరాం.

మర్నాడు అందరం పోలీస్‌స్టేషన్‌కి చేరుకున్నాం. మమ్మల్ని అంతదూరంలో చూస్తూనే ఇన్‌స్పెక్టర్ లంచాలు దొరకని టౌన్‌ని చూసినట్లు చూశాడు.

"ఉధరీ రోకో– ఓ లోగోం కో! క్యా హెూనా పూఛో!" అంటూ గావుకేక పెట్టాడు మండిపడుతూ. కానిస్టేబుల్స్ తుప్పు పట్టిన తుపాకులు తీసుకొచ్చి మాకడ్డం నిలబడ్డారు.

"క్యా హెూనా?" హెడ్ కానిస్టేబుల్ బయటికొచ్చి అడిగాడు.

"మీరు ఓ చిన్న సహాయం చేస్తారేమోనని" గొణిగాడు రంగారెడ్డి.

"మదద్ కావాలి? ఏం మదద్ కావాలి? మీ కాలనీ ఓండ్లందరూ తురమ్‌ఖాన్లు కదా! జులుస్‌లు తీస్తరు, మినిష్టర్ సాబ్ దగ్గర షికాయత్ జేస్తరు! మళ్ళీ మా పోలీసోండ్ల తోటి ఏం పని?"

"మాకు సహాయం వూరికే చేయనక్కర్లేదు హెడ్‌గారూ! ఏదో చూసుకుందాం"

హెడ్ మరింత కోపంగా చూశాడు. "ఏంది చూసుకునేది."

"అదేసార్! మీకు తెలీందేముంది? ఎంతోకొంత డబ్బిస్తాం" దూరంగా దభేల్ మన్న చప్పుడు వినిపించింది. అంతవరకూ పక్కగదిలో అసహనంగా, మండిపడుతూ చూస్తోన్న ఇన్‌స్పెక్టర్‌కి ఆ డైలాగ్ అంత నెమ్మదిగా మాట్లాడినా ఎలా వినబడిందో తెలీదు. మరి! గాబరాగా, ఆనందంగా ఒక్క ఉదుటున లేచి ఆ కంగారులో కుర్చీని వెనక్కు పడేసి ఆత్రుతగా మా దగ్గర కొచ్చాడు.

"బయట నిలబడి ముచ్చట్లేమయ్యా! లోపటరాండ్రి, ఏమైనా తక్‌లీఫుంటే నాతో జెప్పాలె! రాండ్రి" అన్నాడు ఆప్యాయంగా ఆహ్వానిస్తూ.

అందరం అతనిలోని సడెన్ మార్పుకి ఆశ్చర్యపోతూ, ఈ మార్పుకి కారణమైన డబ్బుని సృష్టించినవాడికి దణ్ణాలుపెట్టుకుంటూ ఇన్‌స్పెక్టర్ గదిలోకి నడిచాం.

"ఏమి సంగతి?ఏం మదద్ కావాలి?" అడిగాడతను.

"మేమందరం కలిసి సిటీ బయట ఇళ్ళస్థలాలు కొనుక్కున్నాం సార్! కొని చాలా రోజులైంది. ఇవాళ మంచిరోజని భూమిపూజ చేయడానికెళ్తే..."

"హ్హాహ్హాహ్హా! మాకు తెల్సు ఏం జరిగిందో! ఆడ గుడిశెలు వేసిన్రెవరో గంతనేనా?"

అందరూ ఆశ్చర్యపోయాం.

"అవ్ సార్! మీ కెట్లెరుక? అడిగాడు యాదగిరి.

"మాకెరుక లేవయ్యా! పోలీసోండ్లకు తెలిందేముంటది? ఇప్పుడు ఆగుడిశె లోళ్ళను ఆ జాగల్లోకెళ్ళి భగాయించాల్నా. గంతేగదా!"

"అవున్సార్!"

"అయితే కాష్ ఇవ్వండి!"

రంగారెడ్డి మమ్మల్ని అందరినీ పక్కకు పిల్చుకెళ్ళాడు.

"అందరూ ఎంతుంటే అంతివ్వండి" అన్నాడు.

ఆడాళ్ళూ, మగాళ్ళూ, పిల్లలూ అందరూ తమ దగ్గరున్న డబ్బంతా ఊడ్చి రంగారెడ్డి చేతిలో పోశారు. రంగారెడ్డి ఆ చిల్లర నోట్లన్నీ లెక్కబెట్టడానికి రెండు గంటలుపట్టింది.

"పదకొండు వందలు" అన్నాడు ఆనందంగా.

"అమ్మో! పోలీసులకు అంతెందుకు? అయిదొందలు చాలు" అన్నాడు శాయిరామ్. కానీ అతని మాటలు ఎవరూ వినిపించుకోలేదు.

వెయ్యిరూపాయలు లెక్కపెట్టి ఇన్‌స్పెక్టర్ టేబుల్ మీదుంచాడతను. నలుగురు కానిస్టేబుల్స్ కలిసి అరగంటసేపు లెక్కపెట్టి "వెయ్యిరూపాయలు" అంటూ చెప్పారు ఇన్‌స్పెక్టర్‌తో.

ఇన్‌స్పెక్టర్ మొఖంలో మళ్ళీ కోపం, ద్వేషం, పగ, ప్రతీకారం అన్నీ కనిపించినాయ్.

"ఏయ్! వెయ్యి రూపాయలేం లెక్కవయ్యా! ఫాల్తూ న్యూసెన్స్ కేస్‌కే రెండు వేలిస్తారు! టీవీ టవర్ పక్కన అంధేరాలో నిలబడినామంటే ఒక్కొ హెల్మెట్‌కేస్కి రెండొందలు రాల్తయ్! మాకేం ముష్టిస్తున్రా?"

అందరం ఇన్‌స్పెక్టర్‌ని బ్రతిమాలాము.

"ఇది కేవలం అడ్వాన్సండీ" అన్నాడు శాయీరాం.

"అంటే మిగతా ఎమౌంట్ ఎంతన్నమాట?"

"ఇంకో నాలుగువేలు ఇస్తామండీ!"

"నాల్గువేలా? నడవదు. అయిదువేలయినా ఇయ్యాలె! సమజయిందా?"

యాదగిరి రాజీ కుదిర్చాడు.

"అచ్చా! ఠీక్‌హై సాబ్! పాంచ్ హజార్ దేంగే!" అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్ సంతృప్తి పడ్డాడు.

"పనయినాంక మిగతా పైసలు ఇయ్యకుంటే ఏమౌతదో ఎరుకనా?"

"నాకెరుకే సార్! మళ్ళీ మా జాగాల్లో గుడిసె లేయిస్తారు గంతనే కదా!"

"కరెక్ట్! ఏయ్ కృష్ణా! నలుగురు జవాన్లతోటి వెళ్ళి ఆ గుడిసెలు తీయించు" అసిస్టెంట్ సబిన్‌స్పెక్టర్‌కి పురమాయించాడు అతను.

లావుగా, జగజ్జెట్టీల్లా నలుగురు పోలీసులు. ఒక అసిస్టెంట్ సబిన్‌స్పెక్టర్‌తో సహా

అందరం ఆనందంగా మా స్థలాలు చేరుకున్నాం! చాలామంది గుడిసెల ముందు కూర్చుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరఫరా చేస్తున్న వారుణి వాహిని తాగుతూ, బాటిల్స్ ఖాళీ చేస్తున్నారు.

మమ్మల్ని చూడగానే గుడిసెల వాళ్ళంతా మళ్ళీ గుమికూడారు. ఈసారి మా పక్కన పోలీసుల్ని చూసేసరికి వాళ్ళ మొహాల్లో ఆందోళన కనిపించింది. మేము వాళ్ళ ముందు గర్వంగా, ధీమాగా నిలబడ్డాం. కాసేపట్లో వాళ్లు మా కాళ్ళమీద పడిపోతారని మాకు తెలుసు.!

"వాళ్లు క్షమించమంటూ మనకాళ్ళ మీదపడినా మనం వాళ్ళను చూసి జాలి పడకూడదు" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! ఇలాంటి దురాక్రమణ సన్నాసులకు గట్టిగా బుద్ధి చెప్పాలంటే పోలీసులతో బాగాతోమించాలి" అన్నాడు గోపాల్రావ్.

"చూస్తుండండి ఆళ్ళందరి కాళ్ళూ చేతులూ ఇరగ్గొడతారు" అన్నాడు యాదగిరి.

"వాళ్ళ సంగతెలా ఉన్నా వాళ్ళ లీడర్ని మాత్రం వదలకూడదు" అన్నాడు శాయిరామ్.

"అవునవును! వాడిని వారం దినాలకు తక్కువ కాకుండా లాకప్‌లో ఉంచి దినాము బొక్కలిరగ్గొడితే గానీ సుధరాయించడు"

లావుపాటి పోలీస్ కానిస్టేబుల్ వాళ్ల మధ్యకు వెళ్ళాడు.

"ఏయ్! ఈ జాగాలు ఎవళ్ళవిరా?" అడిగాడు లాఠీ భయంకరంగా తిప్పుతూ.

వాళ్ళు కంగారుపడిపోయారు.

"మావే దొరా!"

"అంటే మీరు కొన్నారు బే?"

"అవ్ దొరా?"

"ఏయి? రిజిస్ట్రేషన్ పేపర్స్ తేంద్రా?"

"లేవు దొరా! అయన్నీ మా లీడర్ దగ్గరున్నాయ్!"

"ఎవళ్ళు రా మీ లీడర్! ఆడిని రమ్మను జల్దీ"

నలుగురు లీడర్ కోసం పరుగెత్తారు.

కానిస్టేబుల్ మళ్ళీ మాదగ్గర కొచ్చాడు.

"చూశారా! మనమంటే ఈ ట్విన్‌సిటీ లోనే అందరికీ హడల్. మీకెరుకనో లేదో నలుగురు దాదాలను లాకప్‌లో వేసి కాళ్ళూ చేతులూ నా చేతుల్తోటే ఇరిచినా!"

అందరం ఆశ్చర్యపోయాం.

"నలుగురినా?" అనుమానంగా అడిగాడు వెంకట్రావ్.

"అవ్! ఏమనుకున్నావ్ మళ్ళా? నలుగురికీ కాళ్ళూ చేతులూ ఇరిచేసినా! కొడుకులు పరేషానయి పోయిన్రు! ఇప్పుడేం జేస్తున్రో ఎరుకనా వాళ్ళు?"

"ఏం జేస్తన్రు సార్?"

"దెబ్బకు దాదాగిరి బంద్‌జేసి మంచిగ ఇజ్జత్ తోటి బ్రతుకుతున్రు!"

"అంటే మంచిగా ఉద్యోగాలు చేసుకుని పెళ్ళాం బిడ్డల్ని బాగా చూసుకుంటూ జీవితం గుడుపుతున్నారా సార్?"

"ఉద్యోగం గిట్టా కాదు గానీ నాంపల్లి స్టేషన్‌లో రైల్వే సీట్లు బ్లాకులో అమ్ముకుంటున్రు! మంచి మనుషులంటే గట్లుండాలి! దాదాగిరి చేస్తే ఏమొస్తది వయా! ఏదొక కొలువు జేసుకోవాలె! బతకాలె!"

అప్పుడే గుడిసెల నాయకుడు వచ్చాడు.

కానిస్టేబుల్ వాడిని వస్తూనే చొక్కా పట్టుకుని నేలమీద పడేసి తన్ని బయటకు గెంటుతాడని మాకు తెలుసు.

కాని ఎందుకో కానిస్టేబుల్ అలా చేయలేదు.

"ఎవళ్ళురా ఈడ గుడిసెలేయించిన్రు?" అనరిచాడు తీవిగా. వాళ్ళ నాయకుడు తాపీగా నడిచి కానిస్టేబుల్ దగ్గరకు చేరుకున్నాడు.

అతనిని సమీపంగా చూస్తూనే ఉలిక్కిపడ్డాడు కానిస్టేబుల్ అతనితో పాటు మిగతా వారందరూ కూడా నిశ్చేష్టులయిపోయారు.

"నేనే గుడిసె లేయించాన్రా! ఏమ్ సంగతి?" కానిస్టేబుల్ వంక క్రూరంగా చూస్తూ అన్నాడు ఆ లీడర్.

కానిస్టేబుల్ అమాంతం ఎగిరి సెల్యూట్ కొట్టాడు.

"హలో! నువ్వా అన్నా! నేనింకా ఎవళ్ళో అనుకుంటున్నానే!"

"నేనే తంబీ! ఏమిటి సంగతి ఇంతమంది వచ్చిన్రు?"

"అదే! ఈ గుడిసెలన్నీ వీళ్ళ జాగాల్లో వేసిన్రని కంప్లెయింట్ ఇచ్చిన్రు! దాని దిక్కుకెళ్ళి వచ్చినాం! నువ్వని ఎరుకలేదన్నా"

"వీళ్ళంతా మావాండ్లేరా! అంతా గరీబోళ్ళున్నారు. ఒక్కసారి ఆళ్ళను సూడు! తిండీ, బట్టా ఏమున్నదివయ్యా వాండ్లకు?"

పోలీసులు వాళ్ళవేపు చూశారు

అందరూ మంచి బట్టలతో లావుగా దున్నల్లాగున్నారు. ఒకో గుడిసె ముందూ వాళ్ళు ఖాళీ చేసిన బాటిల్స్ నాలుగయిదు కనిపిస్తున్నాయ్. బయటున్న మంచాల మీద ట్రాన్సిస్టర్లో సినిమా పాటలు వినిపిస్తున్నాయ్. కొన్ని గుడిసెల ముందు మోపెడ్లు, సైకిళ్ళు, స్కూటర్లు ఉన్నాయి.

పోలీసు మొఖంలో జాలి కనిపించింది.

"అవ్ భయ్! ఇస్కీమాకీ– మనకు స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలాయెగానీ గరిబోండ్లు గిట్లనే ఉన్నారు" జాలిపడ్డారు వాళ్ళు. మాకు మతిపోయినట్లయింది.

పోలీసులు వాళ్ళందర్ని చీల్చి చెండాడేస్తారనుకుంటే వాళ్ళు ఆ దాదాకే సలాం కొడుతున్నారు. దాదా మా వంక కోపంగా చూసి పోలీసులతో మాట్లాడ సాగాడు.

"ఇగో సూడండి భయ్యా! వాళ్ళంతా పాగల్ గాళ్ళున్నారు! గరీబోండ్లతో జిద్ చేస్తారు వయ్యా? ఈళ్ళకేమయినా అకల్ ఉన్నదా? మనమందరం కలిసి వాండ్లకు మదద్ చేయాలె! మనమే గుడిసెలు కట్టించి ఇయ్యాలే! అదిపోయి ఉన్నది పీకేస్తానంటే ఏమ్మాటది?"

పోలీసులు మావేపు అసహ్యంగా చూశారు.

"అన్న చెప్పింది ఇన్నారా? ఇక నడవండ్రి!" అన్నారు మాతో.

మాకు వళ్ళు మండిపోయింది.

"ఏయ్! మీకు పైసలిచ్చింది ఈడకెళ్ళి గుడిసెలు తీయించమని! నీతులు చెప్పమని కాదు" అన్నాడు యాదగిరి మండిపడుతూ.

లావుపాటి కానిస్టేబుల్ మావేపు క్రూరంగా చూశాడు.

"ఏయ్! జర సంబాల్‌కే బాత్‌కరో! పైసలిచ్చినం అంటున్నావేం సంగతి? నీయవ్వ మీరిచ్చిన వెయ్యిరూపాయలు మాకు ఒక్క నిముషం ఖర్చు! సమజయింది? లక్షల ఇచ్చినట్లు లొల్లి పెడుతున్రు! నడవండ్రి ఈడకెళ్ళి! గరీబోళ్ళ తోటేందివయ్యా కిరికిరి!" మాకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు. నిశ్శబ్దంగా వెనక్కు తిరిగి మా కాలనీ వేపు బయల్దేరాం.

అందరం మా ఏరియా కౌన్సిలర్‌ని కలుసుకున్నాం.

ఆయన్తో సంగతంతా జెప్పాం.

"ఆ గుడిసెలు ఏడున్నాయ్?"

"మా జగాల్లో సార్?"

"మీ జగాలేడున్నయ్ వయా?"

చెప్పాం.

"ఆ పాండూదాదాతోటి కిరికిరి భయ్. వానికి మస్తు పైసలిస్తేగానీ జగాలు ఖాళీ చేయడు"

"ఎన్ని పైసలవుతయ్ సార్?"

"పాండూదాదాకి పదివేలు! నాకు పాతికవేలు!"

అందరం షాకయ్యాం.

"అదేంటి సార్! అంత డబ్బు ఖర్చయ్యేట్లుంటే ఆ జగాలు వదులుకోవటమే మంచిది కద్సార్"

"వదులుకోండి! ఈడకెందు కొచ్చిన్రు మళ్ళా?"

"మీరు మా కౌన్సిలర్ కద్సార్! మదద్ జేస్తారేమో అని వచ్చినాం."

"పుకట్‌గా ఏ కౌన్సిలర్ అయినాగానీ మదద్ జేస్తార్ వయా? అయినా పుకట్‌గా మీ కెందుకు సర్వీస్ చేయాలి నేను?"

"ఎందుకేంటి సార్! ఎలక్షన్ టైమ్‌లో మీరు మా ఇండ్లకొచ్చి ఓట్ల గురించి రిక్వెస్ట్ జేసిన్రు గదా! మీకే ఓట్లేసినం గనుక మీరే మదద్ జేయాలె".

"ఓట్లకు మస్తు పైసలిచ్చినాన్రా భయ్! రెండు కోట్లు ఖర్చాయె- ఎరుకనా? ఆ పైసలన్ని ఎవడిస్తాడు నాకు. గిట్లనే వసూళ్ళు జేసుకోవాలె"

మేం మళ్ళీ షాకయ్యాం.

"ఏంది సార్? మా ఓట్లకు పైసలిచ్చినావ్-" అడిగాడు యాదగిరి.

"నువ్వుగాకపోతే- నీ తమ్ముడింకోడికి ఇచ్చినారా భయ్! ఒక్కొక్క కాలనీకి ఆరు లక్షలిచ్చినా"

"ఆళ్ళెవరికో ఇస్తే మాకేం సంబంధం సార్"

"ఇగో ఈ బేకార్ మాటలొద్దు. పని గావాల్నా? వద్దా?"

మేమంతా చర్చించుకున్నాం. అంత డబ్బు ఇవ్వటం కంటే ఆ స్థలాలు వదులుకోవటం మంచిదని డిసైడ్ జేసుకున్నాం.

"ఎలాగో మన జగాలు వదులుకుంటున్నాం. మరి ఆ పోలీసులకిచ్చిన పైసలు ఎందుకు వదలాలి? వెళ్ళి మన పైసలు మనకిమ్మని అడుగుదాం" అన్నాడు యాదగిరి.

మర్నాడు అందరం పోలీస్ స్టేషన్‌కెళ్ళి ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకున్నాం!

"ఏంది? మళ్ళీ వచ్చిన్రు?" చిరాకుగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మా జగాలు ఖాళీ చేయిస్తానని పైసలు తీసుకున్నారు కద్సార్- మీ వాళ్ళు చేయించలేకపోయిన్రు-"

"అవ్- ఎవరో లావార్సీగాళ్ళుంటే ఖాళీ చేయిపిస్తాం! పాండూదాదా ఎంక్రోచ్ చేస్తే మేమెట్ల ఖాళీ చేయిస్తాం? ఆడు ఎమ్మెల్యే మనిషికదా! ఎమ్మెల్యేతోటి రకరార్ పెట్టుకుంటారు ఎవళ్ళయినా! ఓల్డ్ సిటీకి ట్రాన్స్‌ఫర్ అయిపోతాం! ఎరుకనా?"

"అయితే మా డబ్బు మాకిచ్చేయండి-" అన్నాడు యాదగిరి.

ఇన్‌స్పెక్టర్ షాకయ్యాడు.

"ఏందీ! మీ పైసలు మీకియ్యాల్నా? మీకేమయినా దమాకున్నాదా? పోలీసులకిచ్చిన పైసలు ఎన్నడయినాగానీ తిరిగొస్తాయ్?"

"రాకుంటే ఆళ్ళను మా జగాల్లోకెళ్ళి ఖాళీ చేయించండి సార్-" యాదగిరి పట్టుబట్టాడు.

మా కందరికీ కూడా తెలుసు– పోలీసులు ఏమైనా చేయగలరు గానీ ఒకసారి తీసుకున్న పైసలు మాత్రం వాపస్ చేయలేరు. అది వాళ్ళ వీక్నెస్– అందుకే యాదగిరి ఆ వీక్నెస్ మీద దెబ్బకొట్టాడు.

గోపాల్‌రావ్ కలుగజేసుకున్నాడు.

"చూడండిసార్– డబ్బు వాపసివ్వకపోతే ఈ మేటరు నా పత్రికలో హెడ్‌లైన్స్‌లో పబ్లిష్ చేస్తా–"

దాంతో ఇన్‌స్పెక్టర్ కొంచెం షేకయ్యాడు.

"అరె! మీరేడ దొరికిన్రురా భయ్! పైసలు రిటర్న్ జేసే ఆదతే మాకు లేదు– ఇగో ఒకపని జేయండ్రి! శంకర్‌దాదా ఎరుకే కదా! ఆయనదగ్గరకు పోయి ఆయన మదద్ తీసుకోండి. ఇంకొన్ని పైసలయితే ఖర్చువుతాయ్ గానీ మీ జాగాలన్నీ మీ చేతికొస్తయ్– కావాల్నంటే నేను భీ శంకర్‌దాదాకి ఫోన్ చేస్తా–" అంటూ సెల్‌ఫోన్లో శంకర్‌దాదాకి రింగ్ చేశాడు.

"నమస్తే అన్నా! నేను జగన్‌ని! ప్రమోషన్ ఏడొచ్చిందన్నా! నువ్‌గట్టిగా తల్చుకుంటేనే గానీ కాదది– అదిసరేగానీ నాతానకో లాండ్ గ్రాబింగ్ కేస్ వచ్చిందన్నా! అందరూ మిడిల్ క్లాసోళ్ళు– పైగా నీ నియోజకవర్గం వాళ్ళు. ఆళ్ళ జాగాలన్నీ ఆ పాండూదాదా మనుషులు కబ్జా జేసిన్రు– ఆళ్ళను నీతానకు పంపుతున్నా! జర మదద్ జేయన్నా– అవ్– పైసలిస్తరు– బరాబరిస్తారు– దాన్దిక్కు కెళ్ళి ఫికర్ లేదు– ఓకే అన్నా థాంక్యూ–" ఫోన్ పెట్టేశాడు.

"విన్నారు గదా– ఇంక శంకర్‌దాదాను కలుసుకోండ్రి–"

అందరం వెళ్ళి శంకర్‌దాదాని కలుసుకున్నాం. మమ్మల్ని చూడగానే గుర్తుపట్టాడతను.

"అరె నీ యవ్వ– మీరా! నేను గుర్తుపట్టనల్లు ఆ ఇన్‌స్పెక్టర్ రికమండేషనెందుకురా భయ్– సంగతేంటో జెప్పండ్రి–"

అంతా వివరించాం– పదివేలకు బేరం కుదిరింది. వారం రోజులు టైమివ్వమన్నాడు శంకర్‌దాదా.

వారం తర్వాత మేమూ మా ఇళ్ళస్థలాల దగ్గరకెళ్ళే సరికి ఒక్క గుడిశె కూడా కనపించలేదక్కడ.

"థూ నీ యవ్వ– ఏ.పి. గవర్నమెంట్– ఏ.పి. పోలీస్ డిపార్ట్‌మెంట్– ఆళ్ళు చెయ్యలేని పని శంకర్‌దాదా చేశాడు– గూండాలంతా అసెంబ్లీలోకీ పార్లమెంట్‌లోకీ వస్తున్రంటే రాకేం జేస్తరు మళ్ళా!

మనలాంటి ఎడ్యుకేటెడ్ గూడా వాండ్లకే ఓట్లేసే పరిస్థితులాయె–" అన్నాడు యాదగిరి కసిగా.